పిల్లల్లోని సృజనాత్మకత వెలికితీయాలి


పిల్లలకు మెమొంటోలు అందజేసిన కేజీయూ రీచర్డ్స్

ముషీరాబాద్: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి ఆయా రంగాలలో వారు మరింత ప్రావీణ్యం సాధించేలా కృషి చేయాలని ప్రార్థన వీరుల చర్చి వ్యవస్థాపకుడు పాస్టర్ మరిదాస్ అన్నారు. బుధవారం రాంనగర్‌లోని ప్రార్థన వీరుల చర్చిలో నిర్వహించిన వీబీఎస్ ముగింపు కార్యక్రమానికి మరిదాస్, సూపరింటెండెంట్ కేజీయూ రీచర్డ్స్ హాజరై చిన్నారులకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 10 రోజుల పాటు బైబిల్‌తో పాటు నృత్యం, సంగీతం తదితర రంగాలలో చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇచ్చామని తెలిపారు. ప్రతి సంవత్సరం వేసవిలో చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తూ వారికి ఆసక్తి ఉన్న రంగాలలో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీబీఎస్ డైరెక్టర్లు ఎం.ఎస్తా, బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

సుందరయ్య విజాన కేంద్రం: అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జాతీయ అసంఘటిత రంగ కార్మికుల సంఘం జాతీయ కన్వీనర్ చెన్నయ్య అన్నారు. సాంఘిక భద్రత 2020 చట్టం రాష్ట్రంలో అమలు చేయకపోవడం విచారకరం అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఎన్టీఓ, స్వచ్ఛంద సంస్థల సమావేశంలో చెన్నయ్య మాట్లాడారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించాలని కోరారు. మహిళల ప్రసూతి కోసం రూ.50వేల ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఈఎస్ఐ, పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. ప్రమాదంలో మృతి చెందినా లేదా అంగవైకల్యం పొందినా కార్మిక కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు, చట్టాలపై గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తమ డిమాండ్లపై ఇటీవల సేకరించిన సంతకాలను త్వరలో కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రఫుల్ రామిరెడ్డి, ప్రసాద్ అవినాష్, వెంకటయ్య, అమృత , ఇందిర, రేణుక తదితరులు పాల్గొన్నారు

డెమో రైలులో ల్యాప్‌టాప్ చోరీ

కాచిగూడ: డెమో రైల్లో ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీ జరిగిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ ప్రాంతానికి చెందిన ఏనుగుల నవీన్‌కుమార్ (26) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. మెదక్ నుంచి కాచిగూడకు డెమో రైలులో వస్తుండగా విద్యానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో ల్యాప్‌టాప్ కనిపించలేదు. రైలులో బాత్‌రూమ్‌కు వెళ్లి తిరిగి సీటు వద్దకు వచ్చి చూసే సరికే ల్యాప్‌టాప్ కనిపించకుండా పోయింది. దీంతో నవీన్‌కుమార్ కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

24న 'వసంత గానం' సంగీత కార్యక్రమం

నల్లకుంట: శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి భక్తి సంగీత శిక్షణా తరగతుల ముగింపు వేడుకలు నెల 24న నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి తెలిపారు. బుధవారం అకాడమీ కార్యాలయంలో ఆమె ముగింపు వేడుకల వివరాలు వెల్లడించారు. కింగ్ కోఠిలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో సాయంత్రం 5గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల 'వసంత గానం'సంగీత కార్యక్రమం ఉంటుందన్నారు. దీనికి ముఖ్యఅతిథిగా సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్, యాంకర్ డాక్టర్ సరస్వతి ప్రదీప్, నటుడు రాకెందు మౌళి వెన్నెలకంటి హాజరవుతారని తెలిపారు. టీవీ, ఆలిండియా రేడియో కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణామూర్తి, వర్ధమాన గాయినీ మణి నందిని, మ్యూజిక్ థెరపిస్ట్- కీబోర్డు కళాకారిణి యామినిల పర్యవేక్షణలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

వాన.. హైరానా.!

ముషీరాబాద్‌లో బుధవారం మధ్యాహ్నం 3గంటలకు కురిసిన వర్షానికి పద్మశాలికాలనీలో భారీ వృక్షం విద్యుత్ తీగలపై ఒరిగింది. విద్యుత్ తీగలు లేకుంటే అది రోడ్డు మీద పడేది. దాయారం మార్కెట్ నుంచి రాజా డీలక్స్ చౌరస్తా వరకు రోడ్డంతా బురదమయంగా మారడంతో వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంచినీటి పైపులైన్ నిర్మాణ అనంతరం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్శిగుట్ట, బాపూజీనగర్, వినోభానగర్‌లో వర్షంనీరు పెద్దెత్తున రోడ్లపై ప్రవహించాయి. దీనితో ప్రజలు ఇబ్బందిపడ్డారు.
– ముషీరాబాద్


పద్మశాలి కాలనీలో వర్షానికి విద్యుత్ తీగలపై ఒరిగిన చెట్టు


రాంనగర్‌లో భారీ వర్షం


బురదమయంగా మారిన రాజా డీలక్స్ చౌరస్తా..

నేడు హనుమ జయంతి వేడుకలు



చిక్కడపల్లి: వైశాకమాస కృష్ణపక్ష దశమి రోజును పురస్కరించుకొని వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమ జయంతిని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ దేవానాథం తెలిపారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. ఆలయ ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, అర్చకులు కందాళ వెంకటాద్రి ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి సాయంత్రం వరకు సిందూర అభిషేకం, పంచామృత, వివిధ ఫలరస అభిషేకం, ఆకుపూజ, వడమాలపూజలు, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. భక్తులు, దాతల సహకారంతో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆలయాన్ని రంగురంగుల దీపాలతో ముస్తాబు చేసినట్లు తెలిపారు.

సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో

నల్లకుంట: న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో గురువారం(నేడు) హనుమ జయంతి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణ అధికారిణి కె. జయంతి నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 6.30గంటలకు ఆంజనేయస్వామికి విశేష అభిషేకం ఉంటుందన్నారు. అనంతరం 9గంటలకు తమలపాకులతో సహస్రనామార్చనలు, సింధూర్ పూజ, వడమాల సేవ, హారతులు ఉంటాయని చెప్పారు.

ఘనంగా అహల్యబాయి హోల్కర్ జయంతి


బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన జయంతి వేడుకలో రాణి రుద్రమదేవి, శిల్పారెడ్డి తదితరులు

కాచిగూడ: సమాజ అభివృద్ధి కోసం అహల్యబాయి హోల్కర్ చేసిన సేవలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి అన్నారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో అహల్యబాయి హోల్కర్ 300వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాణి రుద్రమదేవి మాట్లాడుతూ... అహల్యబాయి హోల్కర్ పోరాటాన్ని, చేసిన పాలనను ప్రతి ఒక్కరికి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, ప్రధానకార్యదర్శి డాక్టర్ సమత, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, అనంతలక్ష్మి, కిలారి మనోహర్, సుభాషిణి, జ్యోతి, రజిని, నీరజ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి


జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ పావని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను బుధవారం కలసి సమస్యలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. శానిటేజైషన్ పనులను మెరుగుపరచాలని అన్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి పెండింగ్ పనులను పూర్తి చేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ పార్క్‌లో అనుమతి సమయాన్ని పెంచండి


ఓయూ వీసీ ఎం.కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న డీడీకాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

అంబర్‌పేట: ఉస్మానియా యూనివర్సిటీ ఆక్సిజన్ పార్కులో వాకింగ్ చేసే సమయాన్ని పెంచాలంటూ డీడీకాలనీ అసోసియేషన్ ప్రతినిధలు ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ఎం.కుమార్‌కు వినితి పత్రం అందించారు. బుధవారం వీసీ చాంబర్‌లో కలిసి డీడీకాలనీకి అనుకుని ఉన్న ఆక్సిజన్ పార్క్‌లో వాకర్స్‌కు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రస్తుతం అమలవుతున్న అనుమతి సమయన్ని మరింత పెంచాలని కోరారు. యూనివర్సిటీలో వాకింగ్ చేయడానికి ఎంతో మంది ఆసక్తి చూపిస్తారని.. వారికి సమయాన్ని మరింత పెంచి తోడ్పాటును అందించాలని కోరారు. దీనిపై వీసీ సానుకులంటా స్పందించి సమయాన్ని పెంచేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు గోవర్ధన్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి, ఆర్.రామిరెడ్డి, రవీందర్, లక్ష్మణ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాకాండను తీవ్రంగా ఖండిస్తున్నాం

ముషీరాబాద్: మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా 26 మందికి పైగా మావోయిస్టులను హత్య చేయడాన్ని సీపీఐఎంఎల్ న్యూడెమాక్రసీ తీవ్రంగా ఖండించింది. బుధవారం న్యూడెమాక్రసీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం ఓ ప్రకటన విడుదల చేస్తూ కొన్ని నెలలుగా ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం హత్యాకాండను కొనసాగిస్తోందన్నారు. శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని పదేపదే కోరిందన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని మేధావులు, ప్రజాస్వామిక వాదులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నప్పటికి ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా పట్టించుకోకుండా ఈ నరమేధాన్ని తీవ్రతరం చేశారని విమర్శించారు. అడవి నుంచి ఆదివాసీలను ఖాళీ చేయించి అడవి సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికే ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందని ఆరోపించారు. ప్రభుత్వం చేస్తున్న ఈ హత్యలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జీలచే న్యాయ విచారణ జరిపించాలని బూటకపు ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావు, మావోయిస్టు పార్టీ సభ్యులకు న్యూడెమాక్రసీ విప్లవ జోహార్లు ప్రకటించింది. ప్రభుత్వం చేస్తున్న ఈ నరమేధాన్ని ప్రజలు, ప్రజా సంఘ వాదులు ఖండించాలని కోరారు.

మధ్య భారతంలో జరుగుతున్న నరమేధాన్ని ఆపాలి: పోటు రంగారావు

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో 26 మందిని బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో కేంద్ర బలగాలు చంపడాన్ని సీపీఐఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తీవ్రంగా ఖండించారు. పదుల సంఖ్యలో మావోయిస్టులను కాల్చిచంపడం ఆనవాయితీగా మారిందన్నారు. సంవత్సర కాలంలో 500 మందిని పైగా చంపేశారని తెలిపారు. ఇప్పటికైనా మధ్య భారతంలో జరుగుతున్న నరమేధాన్ని ఆపాలన్నారు.

ఎంపీ గడ్డం వంశీకృష్ణపై కుల వివక్ష తగదు

కవాడిగూడ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం గోదావరి నదిలో ఇటీవల నిర్వహించిన సరస్వతీ పుష్కరాలలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణకు ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానం అందకపోవడం కుల వివక్ష పాటించడమేనని మాల వారియర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగా శ్రీనివాస్ అన్నారు. బుధవారం దోమలగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సొంత పార్టీకి చెందిన దళిత ప్రజాప్రతినిధులపై కుల వివక్ష పాటించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలిసి వచ్చే దళిత సంఘాలతో రాష్ట్ర ఆందోళనకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

ప్రణాళికాబద్ధంగా రోడ్ల అభివృద్ధి


అంజుమన్ వీధిలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ గౌసుద్దీన్

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లో అధ్వాన స్థితికి చేరుకున్న రోడ్లను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని కార్పొరేటర్ గౌసుద్దీన్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని అంజుమన్ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రూ.1.50 కోట్లతో భోలక్‌పూర్‌లో రోడ్లను పునర్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు షరీఫ్, ఆజీపాషా, నాయకులు అక్లక్ హుస్సేన్, జీహెచ్ఎంసీ వర్కింగ్ ప్రసిడెంట్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల బిల్లులను వెంటనే మంజూరు చేయాలి

కాచిగూడ: సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ హాస్టళ్ల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల ఎస్సీ,బీసీ సంక్షేమ హాస్టల్స్ పెండింగ్ మెస్ బిల్లులను మంజూరు చేశారని, కానీ ఎస్టీ హాస్టళ్లలో మెస్ బిల్లులను ప్రభుత్వం తిరస్కరించిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు ఆర్.కృష్ణయ్యను కలిసి ఎస్టీ హాస్టల్స్ మూతపడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. బిల్లులను పెండింగ్‌లో పెడితే మరికొద్ది నెలల్లోనైనా మంజూరు అవుతాయనే నమ్మకం ఉండేదన్నారు. కానీ బిల్లుల టోకెన్లు తిరస్కరిస్తే మరో ఏడాదైనా మంజూరయ్యే అవకాశం లేదని తెలిపారు. దీంతో ఎస్టీ హాస్టల్స్ నిర్వహించే అవకాశం లేక హాస్టళ్లు మూతపడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. హాస్టల్స్ మూతపడితే గిరిజన విద్యార్థుల చదువు ఆగిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులను చదువులో ప్రోత్సహించడానికి జీహెచ్ఎంసీ పరిధిలో మరో 10 బాలికలు, 10 బాలుర హాస్టళ్ల మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నామినేటెడ్ పోస్టులన్నీ అగ్రవర్ణాలకేనా.?

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులన్నీ అగ్రవర్ణాలకే కట్టబెడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆరోపించారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగడం లేదని, బీసీలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నామినేటెడ్ పోస్టుల్లో బీసీలను భర్తీ చేసి చూపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సమాచార కమిషనర్ నియామకాల్లో సామాజిక న్యాయం పూర్తిగా కొరవడిందని అన్నారు. ప్రభుత్వం ఏకపక్షంగా బీసీలకు అవకాశం ఇవ్వకుండా అగ్రకులాలకే కమిషనర్ పదవులను కట్టబెట్టిందని ఆరోపించారు. రాష్ట్రంలో మొత్తం 10 సమాచార కమిషనర్ పదవుల్లో ఇప్పటి వరకు 7 పదవులు భర్తీ చేయగా, అందులో ఒక్క బీసీ అభ్యర్థికి కూడా అవకాశం దక్కలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన ద్వారా బీసీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీలు అమలు కావడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సౌత్ ఇండియా ఇన్‌చార్జి సూర్యనారాయణ, బీసీ నేతలు జానయ్య, జెల్ల నరేందర్, భద్ర, తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీరు నిలువకుండా చూడండి


నింబోలిఅడ్డలో పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్

కాచిగూడ: వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేటర్ ఉమా అధికారులకు సూచించారు. బుధవారం నింబోలిఅడ్డ సమోసా పార్కు వద్ద వర్షపు నీరు వెళ్లే కచ్చా మోరీల్లో చేపట్టిన పూడికతీత పనులను ఆమె పర్యవేక్షించారు. రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రశాంత్, బీజేపీ నేతలు శ్రీకాంత్, నిఖిల్, వినోద్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, వాసు, ఎస్.రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నాం


షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేదల పక్షపాతి కేసీఆర్ అని ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బుధవారం హిమాయత్‌నగర్ మండల కార్యాలయంలో నాలుగు షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ సంధ్యారాణితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఠాగోపాల్ మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతి కోసం తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ అధ్యక్షులు శంకర్ ముదిరాజ్, వల్లాల శ్యామ్‌యాదవ్, శ్యామ్‌కుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి


ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి: కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ ఆధ్వర్యంలో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యమ్రాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో బుధవారం రాజీవ్‌గాంధీ చిత్రపటానికి ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా పూలమాల వేసి నివాలర్పించి మాట్లాడారు. భారత ప్రధానిగా రాజీవ్‌గాంధీ దేశానికి ఆయన విలువైన సేవలు అందించారన్నారు. ఆర్థిక, సరళీకృత విధానాలతో భారత్‌ను బలమైన దేశంగా నిలబెట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, నేతలు వీడీ కృష్ణ, అంజియాదవ్, శీలం సత్యనారాయణ, గుర్రంశంకర్, మారిశెట్టి నర్సింగరావు, పాశం అనిల్‌కుమార్‌యాదవ్, విజయ్, నాగభూషణంగౌడ్, డీఎస్. మధుమతి, కేకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

24, 25వ తేదీల్లో ఉచిత వివాహ పరిచయ వేదిక

కాచిగూడ: సికింద్రాబాద్ లోని అమృతవాణి కేంద్రంలో ఈనెల 24, 25వ తేదీల్లో ఉచిత వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఎస్. అబ్రహం తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని ఆసక్తి గల వివిధ కులాల వధూవరుల తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి పాల్గొని వివాహాలు కుదుర్చుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

బీసీ విద్యార్థులకు '10వేల ర్యాంక్' నిబంధన ఎత్తివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్‌గౌడ్

కవాడిగూడ: ఇంజినీరింగ్ విద్యలో బీసీ విద్యార్థులకు 10,000 ర్యాంకు నిబంధన ఎత్తివేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే బీసీ విద్యార్థులకు 10,000 ర్యాంకు నిబంధన ఎత్తేస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల మాదిరిగా బీసీ విద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు చెల్లిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌తో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చిందని తెలిపారు. బీసీ జాబితాలో ఉన్న ముస్లింలకు ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి ఫీజులు ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. కానీ బీసీ విద్యార్థులకు మాత్రం 10వేల ర్యాంకు నిబంధన అమలు చేస్తూ రూ.35,000 మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోందని వాపోయారు. దీని వల్ల టాప్‌టెన్ ఇంజినీరింగ్ కళాశాలలో బీసీ విద్యార్థులు సీట్లు సాధించినప్పటికీ రూ.2లక్షల పైగా ఉన్న ఫీజులు చెల్లించలేక చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్ యాదవ్ ,హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రం రజక తదితరులు పాల్గొన్నారు.